క్లుప్తంగా

సరిహద్దులో నిరంతర తనిఖీలు



అలంపూర్: బర్డ్‌ఫ్లూ నియంత్రణలో భాగంగా అంతర్రాష్ట్ర సరిహద్దులో నిరంతర తనిఖీలు చేపడుతున్నారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారి పుల్లూరు టోల్ ప్లాజా వద్ద పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కోళ్లు, కోడి గుడ్లు, దాణా వాహనాలను తిరిగి వెనక్కు పంపుతున్నట్లు అధికారి శంకరయ్య తెలిపారు. కార్యక్రమంలో చెక్‌పోస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



ధరూరు: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితులకు అందజేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. వివరాలు.. మండల పరిధిలోని నెట్టెంపాడు గ్రామానికి చెందిన ఎల్లప్ప తన మొబైల్ పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు మొబైల్ ట్రేస్ చేసి బాధితుడికి శుక్రవారం అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

మల్దకల్: మండల కేంద్రంలోని శ్రీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎంపీ శంకర్ తెలిపారు. గద్వాల శుభకర ఆస్పత్రి వైద్యురాలు లావణ్యచే కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దండోరా సభలు విజయవంతం చేయాలి

గద్వాల: మాదిగల హక్కుల కోసం దండోరా ఆధ్వర్యంలో ఈనెల 27, 28వ తేదీల్లో నాగార్జునసాగర్‌లో నిర్వహించనున్న దండోరా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని దండోరా రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్ కోరారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 11శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అసైన్డ్ భూములకు శాశ్వత పట్టా మంజూరు చేయాలి, హైదారాబాదులో మాదిగల అమరవీరుల స్మారక భవనాన్ని ఏర్పాటు చేయాలి, మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి, సొంత స్థలంలో ఇల్లు కట్టుకున్న వారికి రూ.10లక్షల సాయం చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు దండోరా మహాసభ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి



ఆత్మకూర్: అప్పుల కుప్పగా మారిన తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం నారాయణపేటలో జరిగిన సీఎం బహిరంగ సభకు ఆత్మకూర్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రూ. 7లక్షలు కోట్లు అప్పులతో చేసిన అభివృద్ధిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 14 నెలల్లో చేసి చూపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్‌యాదవ్, శ్రీను, నాగేష్, దామోదర్, మహేష్, గణేష్, వెంకటేష్, బుచ్చన్న, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాల ఆవరణలో వాటర్ ట్యాంక్ నిర్మాణం వద్దు

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ ద్వారా నిర్మించే నూతన వాటర్ ట్యాంకు స్థలంను కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధుల నుంచి నిర్మించే ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును హైస్కూల్ ఆవరణలో నిర్మించడం ద్వార విద్యార్థులకు ఆట స్థలం కరువవుతుందన్నారు. ఇతర ప్రభుత్వ స్థలంలో వాటర్ ట్యాంకు నిర్మించాలని లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, కుతుబ్ పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ నిర్మాణం పూర్తయ్యేనా?



మినీ ట్యాక్ బండ్ కాల్వల్లో పెరిగిన ముళ్లపొదలు

- 2019లో రూ.4 కోట్లు మంజూరు
- 40 శాతం పనులు మాత్రమే పూర్తి
- నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

అయిజ: మండల కేంద్రం– బింగుదొడ్డి గ్రామం మధ్యనున్న బింగుదొడ్డి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చేందుకు 2019లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత, పట్టించుకోని పాలకుల నైజం కారణంగా మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. పనులు ప్రారంభించి 6 సంవత్సరాలు గడుతస్తున్నా ఇప్పటి వరకు కేవలం 40 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. సుందరీకరణ మాట దేవుడెరుగు, పనులు పూర్తికాకపోవడంతో చెరువు ఆయకట్టు పొలాలు బీళ్లుగా మారాయి. దీంతో అనేక విధాలుగా నష్టపోతున్నట్లు రైతులు, ప్రజలు వాపోతున్నారు.

ఆదిలోనే హంసపాదు..

అయిజ పట్టణ సమీపంలో కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయం పక్కన బింగిదొడ్డి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పనులు చేపట్టేందుకు రూ. 4 కోట్లు నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తి చేసింది. ఒక కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. ఆ కాంట్రాక్టర్ చేసిన పనులు నాసిరకంగా ఉంటాయని, సకాలంలో పనులు పూర్తిచేయడం లేదని, ఎట్టి పరిస్థితుల్లో ఆ కాంట్రాక్టర్‌తో పనులు చేయనివ్వరాదని అప్పటి మంత్రికి ముఖ్య అనుచరుడుగా ఉన్న ఒక నాయకుడు కోర్టుకు వెళ్లాడు. అదే కాంట్రాక్టర్‌తో పనిచేయించాలని మరో నాయకుడు పట్టుబట్టారు. దీంతో మూడు సంవత్సరాల వరకు ప్రారంభించలేదు. ఎట్టకేలకు కోర్టు తీర్పు కాంట్రాక్టర్‌కు అనుకూలంగా రావడంతో పనులు ప్రారంభించారు.



అసంపూర్తిగా మినీ ట్యాంక్ బండ్ కరకట్ట

చేపట్టాల్సిన పనులు..

ట్యాంక్‌బండ్ కరకట్టలను పటిష్టం చేయడం, బతుకమ్మ గట్టు, కడుగొమ్మవద్ద సీసీ ఫాస్టరింగ్, కాలువల మరమ్మతు పనులు, చెరువు కట్టమీద సీసీ రోడ్డు నిర్మాణం, విద్యుత్ దీపాల ఏర్పాటు చేయాల్సి ఉంది. అదే విధంగా నెట్టెంపాడు ప్రాజెక్ట్ ద్వారా ఏర్పాటు చేసిన ప్రధాన కాలువ నుంచి లింక్ కెనాల్ ఏర్పాటు చేసి సుమారు 600 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది.

నత్తనడకన నిర్మాణ పనులు..

నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పనులను నత్తనడకన సాగించారు. దీంతో కాలయాపన జరిగిందే తప్పా పనులు ముందుకు కదలలేదు. విసిగి వేసారిన ఆర్డీఎస్ అధికారులు వేరే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఆ కాంట్రాక్టర్‌ది అదే తీరు ఉంది.

పనులు త్వరగా పూర్తిచేయాలి..



ట్యాంక్ బండ్ నిర్మాణం ప్రారంభించి సుమారు ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి కాలేదు. పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అటు అధికారులు శ్రద్ధ తీసుకోవడంలేదు. ఉన్నతాధికారులు, మంత్రులు చొరవచూపి వెంటనే నిర్మాణం పనులు పూర్తిచేయించాలి. – లింగన్న, రైతు, అయిజ

ఆహ్లాదకరకర వాతావరణం నెలకొల్పాలి..



చెరువును మిని ట్యాంక్ బండ్‌గా ఆధునికీకరించి ఆహ్లాదకర వాతావరనం నెలకొల్పాలి. పనులు త్వరితగతిన పూర్తిచేసి ఇటు రైతులకు, పట్టణ ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. – నాగిరెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం..

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. సదరు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని త్వరలో మినిట్యాంక్ బండ్ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. – ఆర్డీఎస్ ఈఈ విజయకుమార్ రెడ్డి

పట్టించుకోని ప్రజా ప్రతినిధులు ...

మిని ట్యాంక్ బండ్ నిర్మాణం పనులు ప్రారంభం నుంచి నత్తనడకన కొనసాగుతున్నా ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం అధికారులపై ఒత్తిడి తెచ్చిన పాపానపోలేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం, ఇటు అధికారుల ఉదాసీనత, కాంట్రాక్టర్‌కు నాయకులు అండగా నిలువడం అన్ని వెరసి మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం పనులు నిలిచిపోయాని స్థానిక ప్రజలు పేర్కొన్నారు.

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి



సంతకాలు సేకరిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు

గట్టు: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించి, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని బాలల పరిరక్షణ కమిటీ మండల కన్వీనర్ నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాల హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గట్టులో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఇలా సంతకాలు పూర్తయిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డికి పంపనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గతంలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అని చెప్పి, విద్యకు బడ్జెట్‌కు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. బడ్జెట్‌లో విద్యకు నిధుల కేటాయింపును తగ్గించడం ద్వారా విద్యా ప్రమాణాలు దెబ్బతిన్నట్లు ఆరోపించారు. పూర్తిస్థాయిలో జిల్లా, మండల విద్యాధికారులను నియమించాలని కోరారు. ఉన్నత పాఠశాల, కళాశాలకు వెళ్లడానికి ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. విద్యా వ్యవస్థలో ఖాళీలు తక్షణమే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ



ప్రథమ బహుమతి అందుకుంటున్న విద్యార్థి శివకుమార్

ధరూరు: జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ధరూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రతిభ చాటినట్లు తెలంగాణ తెలుగు టీచర్స్ ఫోరం సభ్యులు తెలిపారు. శుక్రవారం జిల్లాస్థాయిలో జరిగిన క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతిని పాఠశాలకు చెందిన పి.శివకుమార్ గెలుచుకున్నట్లు తెలియజేశారు. జిల్లా స్టోరియల్ అధికారి ఎస్తేర్ రాణి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు.

టీబీతో అప్రమత్తంగా ఉండాలి

కొత్తకోట రూరల్: టీబీ లేని జీవితాన్ని జీవించాలని, ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ అయితే మందులు వాడితే తగ్గిపోతుందని పెద్దమందడి పీహెచ్‌సీ డాక్టర్ యశశ్విని అన్నారు. క్షయవ్యాధి గుర్తింపు శిబిరంలో భాగంగా శుక్రవారం పెద్దమందడి మండల కేంద్రంలో 135మందికి, చిన్నమందడిలో 108మందికి ఎక్స్‌రేలు తీసినట్లు డాక్టర్ తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట చెమటలు పట్టడం, తరచూ జ్వరం రావడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉన్నవారు దగ్గరలోని పీహెచ్‌సీలో నమూనాలు ఇచ్చినట్లయితే వ్యాధిని గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భాస్కర్, సూపర్‌వైజర్ ఓంప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలానికి తరలిన శివస్వాములు



శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరిన శివ మాలధారులు

ఎర్రవల్లి: మండలం పరిధిలోని జింకలపల్లి శివాలయంలో శుక్రవారం శివస్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వాములు ఇరుముడులతో ఊరేగింపుగా భజనలు చేస్తూ పాదయాత్రగా శ్రీశైలానికి తరలివెళ్లారు.

అయిజ: మున్సిపాలిటీ పరిధి తుపత్రాల గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శివస్వాముల ఇరుముడి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీశైలానికి తరలివెళ్లారు. పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ఆదర్శ్ సురభి
- ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, అత్యుత్తమ ఫలితాలు సాధించి తాము చదివిన పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై సూచనలు చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం తరపున విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గురువారం నిర్వహించిన వార్షికోత్సవానికి సంబంధించిన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గణితంపై విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. సరైన విధంగా గణిత సమస్యలను పరిష్కరించిన విద్యార్థులకు చాక్లెట్లు అందజేశారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న వంటగది నిర్మాణానికి సంబంధించి ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్ అధికారులతో మాట్లాడారు. పాఠశాలలో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేయడానికి అంచనాల నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

భవిత కేంద్రం సందర్శన

భవిత కేంద్రంలోని బాలబాలికలకు ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరపీ వంటివి వాటిలో చక్కగా శిక్షణ అందించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. స్థానిక కేడీఆర్‌నగర్‌లోని మండల విద్యాధికారి కార్యాలయంలో భవిత (ప్రత్యేక అవసరాల బాల బాలికల జిల్లా వనరుల కేంద్రం) కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. భవిత సెంటర్ ఉన్న చిన్నారులతో కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడారు. ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి కావాల్సిన వసతులు సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. వారి నైపుణ్యాలను తీర్చిదిద్ది స్పెషల్ స్కూల్ నుంచి నార్మల్ స్కూల్‌కు పంపడానికి అన్నిరకాలుగా అవసరమైన విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. ఫిజియోథెరపీకి సంబంధించి వైద్య శాఖ నుంచి థెరపిస్టును పిలిపించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు యుగంధర్, శేఖర్, బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, భవిత కేంద్రం సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు సూచించారు. కర్నూల్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుక్రవారం అందజేశారు. ఎర్రవల్లి మండలం వల్లూరు గ్రామానికి చెందిన పెద్ద వెంకట్రాములుకు వైద్య ఖర్చులకు రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు తెలిపారు. అదే విధంగా అయిజ మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు రూ.36 వేల చెక్కు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్, డేవిడ్, మహేష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు వెలికితీయడమే లక్ష్యం



ధరూరులో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికితీయడమే ప్రతిభా ఉత్సవాల లక్ష్యమని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు నైపుణ్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి ప్రతిభా ఉత్సవాలను ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్, రైటింగ్ అండ్ రీడింగ్, డ్రాయింగ్, నాటకాలతో పాటు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నరేష్, రాజేశ్వర్ రెడ్డి, కాంప్లెక్స్ సెక్రటరీ వెంకటయ్య, ఆర్పీలు ఆంజనేయులు, హరిప్రియ, కిషోర్‌కుమార్, సీతం నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ప్రతిభా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన తదితర నైపుణ్య పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈఓ రామకృష్ణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హేమలత, అనితాబాయ్, మునిస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

అయిజ: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని గద్వాలలోని బాలభవన్‌లో తెలుగు టీచర్స్ ఫోరం జోగుళాంబ గద్వాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాష ప్రతిభా పోటీలు నిర్వహించారు. పోటీల్లో మండలంలోని ఉత్తనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పుట్ట పోగు పవిత్ర జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి పొందింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని పవిత్రను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: విద్యార్థుల చదువుతో పాటు పలు అంశాలపై అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాధికారి అమీర్‌పాష అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొండేరు ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రతిభా ఉత్సవాల కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లా. ఈ సందర్భంగా పలు విద్యా అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు అనుభంద అంశాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనందించాలి



సైకిళ్లు పంపిణీ చేస్తున్న అధికారులు

అయిజ: పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు దాతలు ముందుకు రావాలని ఎంఈఓ రాములు, ఎస్‌ఐ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉప్పల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతిరోజు విద్యార్థులు ఉప్పల క్యాంప్ గ్రామం నుంచి ఉప్పల గ్రామానికి నడుచుకుంటూ వస్తున్నారని, వారి ఇబ్బందులు తొలగించేందుకు సింధనూరు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త మూలగుండం శివరామకృష్ణ 16 సైకిళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బలరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సంగీతలక్ష్మి

మల్దకల్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల ప్రత్యేకాధికారి సంగీత లక్ష్మి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మల్దకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రత్యేకాధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, ఎంపీఓ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులుగా విద్యార్థులు

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విద్యారులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా వివిధ అధికారుల పాత్రలు పోషించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గద్వాలటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు చక్కటి బోధన చేశారు. ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు హెచ్‌ఎం జహురుద్దీన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ వేడుకలు

- గణపతి హోమం, యాగశాలతో క్రతువు ప్రారంభం
- అభయాంజనేయ ఆలయం నుంచి వీరాంజనేయ, శివ, నవగ్రహ, నాగదేవత విగ్రహాల రాక



వనపర్తిలో యాగశాల పూజలో పాల్గొన్న మాజీ మంత్రి దంపతులు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని పాతబజార్ వీరాంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు శుక్రవారం ప్రముఖ వేద పండితులు జోషి ప్రశాంత్‌శర్మ నేతృత్వంలో ప్రారంభమయ్యాయి. 400 ఏళ్ల క్రితం సంస్థానాధీశుల కంటే పూర్వం నాటి వీరాంజనేయ ఆలయం వనపర్తిలో చేపట్టిన రోడ్ల విస్తరణలో తొలగించడంతో పునః ప్రతిష్ఠ మహోత్సం ఆగమశాస్త్ర ప్రకారం వేదపండితులు చేపడుతున్నారు. తొలిరోజు గణపతి పూజ, హోమాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య చేపట్టి రక్షాబంధనంతో అఖండ దీపస్థాపనకు అంకురార్పణ చేశారు. పంచద్రవ్య మేళనంతో నూతన ఆలయాన్ని ప్రోక్షణం చేసి, దీక్షాధారణ, సర్వతోభద్ర మండలం, యోగిని మండలం, వాస్తు మండలం, క్షేత్రపాలన పూజ, నవగ్రహ మండల దేవతా ఆవాహనం క్రతువును పండితులు జరిపించారు.

మాజీ మంత్రి దంపతుల పూజలు

యాగశాల సంస్కార అంకురార్పణలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, వాసంతి దంపతులు పాల్గొని, పూజాధికాలు నిర్వహిటించిన అనంతనం మూల మంత్ర జపం, అగ్నిప్రతిష్ఠతో పాటుగా సాయంత్రం జలాధివాసం, మంగళహారతి పూజలు భక్తులను కనువిందు చేశాయి. అంతకుముందు రాంనగర్‌లోని అభయాంజనేయ ఆలయంలో కొలువుదీరిన వీరాంజనేయ మూర్తి, శివలింగానికి, నవగ్రహాలకు, నాగదేవతామూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టి ఉద్వాసనన పలకడంతో పున:నిర్మించిన ఆలయానికి వీరాంజనేయ స్వామితో పాటుగా మిగతా దేవతామూర్తును మేళతాళాలతో, భజాభంజ్రీలతో రహదారిని జలాలతో శుద్ధి చేస్తూ ఊరేగింపు చేశారు. మరో రెండు రోజుల పాటు ఆలయంలో విశేషంగా పూజలు నిర్వహించనున్నట్లు జోషి ప్రశాంత్‌శర్మ వెల్లడించారు. కార్యక్రమంలో వేదపండితులు ధీరజ్‌శర్మ, గణేష్‌శర్మ, శాంతికుమార్‌శర్మ, నరేందర్‌శర్మ, ఆలయ కమిటీ, భక్తబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.